# పెళ్లి సంబంధం

**– గోగుమళ్ల కవిత**

''నాకీ సంబంధం ఇష్టంలేదు'' విసురుగా చెప్పి చెప్పుల్లో కాళ్లుదూర్చి గేటు తీసుకుని వెళ్లిపోతున్న కూతుర్ని ఆశ్చర్యంగా చూస్తుండిపోయిందామె.

క్రితంరోజు సాయంత్రం నుండి ఎంతగా అడిగినా కూతురు నుండి అదే సమాధానం వినీ వినీ విసుగొచ్చేసిందామెకు. అసలు తనకేం తక్కువ? గౌరవప్రదమైన కుటుంబం. పంచాయతీరాజ్‌లో ఇంజనీరుగా మంచి జీతం. అమ్మానాన్న తప్ప ఆడ బిడ్డల బాదరబందీ లేదు. పైగా ఒకే ఊరు. అందర్లా అమ్మాయిని చూశాక ఏ విషయం ఉత్తరం రాస్తాం అంటూ తప్పించుకోకుండా అమ్మాయి నచ్చిందని సూటిగా చెప్పేశారు. ముఖ్యంగా కట్నం విషయంలో కూడా వాళ్లకేమీ పట్టింపులు లేవని విన్నాక అంత మంచి సంబంధం వెదుక్కుంటూ వచ్చినందుకు కన్నతల్లిగా ఆమెంతో పొంగిపోయింది.

మంచిరోజు చూసుకుని తాంబూలాలు ఇచ్చి పుచ్చుకుందామని వాళ్లు చెప్పి వెళ్లిపోయాక కూతురు నోటివెంట సంబంధం ఇష్టంలేదని వింటే ఏ తల్లి మనసు బాధపడదు?

ఒక్కతే కూతురని గారాబంగా పెంచి కోరిందల్లా కొనిచ్చి మురిపెంగా చూసుకుంటుంటే మరీ పెంకితనం ఎక్కువైంది దానికి. మనసులోనే విసుక్కుందామె. దాని పెంకితనానికి తోడు భర్త రామకృష్ణ కూతురుకి వంత పాడటం ఆమెకింకా కోపాన్ని తెప్పించింది.

నాలుగు చివాట్లేసి కూతుర్ని పెళ్లికి ఒప్పించకుండా ''నీకిష్టం లేకపోతే వద్దులేమ్మా! ఈ సంబంధం కాకపోతే ఇంకొకటి. ఇంత చిన్న విషయానికి బాధపడడం దేనికి?'' అంటూ బుంగమూతి పెట్టిన కూతురిని ఆయన బుజ్జగించడం ససేమిరా నచ్చలేదామెకు.

''అసలు ముందు దీనికి కాదు ఆయనకు బుద్ధి చెప్పాలి. ఇప్పుడది కాలేజీకి వెళ్లిందిగా! ఈలోపే అమ్మాయికి బుద్ధి చెప్పి ఎలాగైనా ఈ పెళ్లికి ఒప్పించమని ఆయనకు బాగా చివాట్లేయాలి'' అనుకుంటూ వంటిల్లు సర్దడం పూర్తిచేసి డ్రాయింగ్‌రూమ్‌లో టీవీ చూస్తున్న భర్త రామకృష్ణ దగ్గరకు వెళ్లిందామె.

★★★

''ఏమైందే నీ పెళ్లిచూపుల ప్రహసనం?'' పర్స్‌లో నుంచి క్యాడ్‌బరీస్ చాక్లెట్స్ తీసి తలా ఒకటి ఇచ్చి తానొకటి నోట్లో వేసుకుని అడిగింది చుడీదార్‌లో వున్న వనజాక్షి.

''క్యాండిడేట్‌కి ఎన్ని మార్కులేశావ్?'' చాక్లెట్ రేపర్‌తో బొమ్మ తయారుచేస్తూ అడిగింది జీన్స్‌లో వున్న డాలీ.

''నీలా అందంగా ఉన్నాడా?'' అవసరంలేని సిగ్గును అభినయిస్తూ అడిగింది చీరలోవున్న ముప్పయ్యేళ్ల మంగతాయారు.

''ఏంటే సమాధానం చెప్పవు?'' మౌనంగా కూర్చున్న సౌమ్యను విసుగ్గా అడిగింది అందరికంటే చిన్నదైన శ్రీదేవి.

''నాకతను నచ్చలేదు'' మోకాళ్ల చుట్టూ చేతులు చుట్టి నిర్లిప్తంగా చెప్పింది సౌమ్య.

''వ్వాట్... నీకు నచ్చలేదా? అయినా నీకు నచ్చాలని రూలేం లేదుగా! ఆయనకు నువ్వు నచ్చితే చాలు. పెళ్లయిపోతుంది'' అందర్లోకి ముందుగా షాక్ నుండి తేరుకుని మళ్లీ సిగ్గుని అభినయిస్తూ ఆరిందలా చెప్పింది మంగతాయారు.

''అయినా ఎందుకు నచ్చలేదే? ఏం చేస్తాడతను? ఏ ఊరు?'' ప్రశ్నల వర్షం కురిపించింది వనజాక్షి.

అన్ని ప్రశ్నలకు సౌమ్య సమాధానాలన్నీ ఓపిగ్గా విన్న వాళ్లందరూ ఏకకంఠంతో అడిగారు.

''నీకేమైనా పిచ్చి పట్టిందా? ఇంత మంచి సంబంధం నీకు నచ్చలేదా? అసలు నీకు నచ్చని విషయం ఏముందే ఇందులో?''

''ఉంది.''

''ఏమిటో అది?''

''అతనికి బట్టతల.''

విసురుగా చెప్పి వెళ్లిపోతున్న సౌమ్యవంక నోళ్లు తెరుచుకుని చూస్తుండిపోయారు ఆ అమ్మాయిలందరూ.

★★★

''ఏం బేబీ ఈ టైమ్‌లో కాఫీ తాగుతున్నావు?'' ఆమె ప్రక్కనే సోఫాలో కూర్చుంటూ అడిగాడు తండ్రి రామకృష్ణ.

''అమ్మ విసిగింపులతో తల వేడెక్కిపోయింది డాడీ'' రెండు వేళ్లతో కణతలు నొక్కుకుని కాఫీ సిప్ చేస్తూ చెప్పింది సౌమ్య.

''ఈ లెటర్ చూశావా?'' జేబులోనుండి ఉత్తరం తీసి ఆమె కళ్లముందు ఆడిస్తూ చెప్పాడాయన.

''మొన్న నిన్ను చూసినవాళ్లు కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఈ సంబంధం వద్దనుకున్నారని...'' అటూ ఇటూ చూసి భార్య దగ్గరలో లేదని నిర్ధారించుకుని చెప్పడం మొదలుపెట్టారు.

''వాళ్లు రాయలేదులే. వాళ్లు రాసినట్లు నేనే రాశాను. ఈ ఉత్తరం కాలేజీకి వెళ్లే దార్లో పోస్టు చేసేయ్. కవర్‌పైన మన అడ్రస్ రాయడం మర్చిపోకు'' అంటూ ఆమె బుగ్గ మీద మృదువుగా వేళ్లతో తట్టి వెళ్లిపోతున్న తండ్రినే చూస్తూ మనసులో అనుకుందామె ''థాంక్యూ డాడీ!''

★★★

''రామకృష్ణగారికి యాక్సిడెంట్ అయింది. మీరు వెంటనే హాస్పిటల్‌కి...'' ఆ అపరిచిత వ్యక్తిని పూర్తిగా మాట్లాడనివ్వకుండానే కంగారుగా అడిగింది సౌమ్య.

''ఏమైంది మా నాన్నగారికి? ఎలా ఉన్నారు? ఏ హాస్పిటల్?''

''మరేం ఫర్వాలేదు. తలకు చిన్న గాయం అయింది. మీరు వెంటనే బయలుదేరి అహల్య క్లినిక్‌కి వచ్చేయండి.''

వెంటనే ఫోన్ డిస్‌కనెక్ట్ చేసి తల్లిని వెంట తీసుకుని ఆదుర్దాగా హాస్పిటల్‌కు బయలుదేరిందామె.

హాస్పిటల్ చేరుకోగానే రిసెప్షన్‌లో వివరాలు కనుక్కొని పరుగెత్తుకుంటూ గదిలోకెళ్లిన సౌమ్య తలకు కట్టుతో స్పృహలేని స్థితిలో మంచంపై పడుకుని వున్న తండ్రిని చూడగానే దుఃఖం ఆపుకోలేకపోయింది. ఇక సౌమ్య తల్లి సుగుణ పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. పెళ్లయిన ఇరవైఏళ్లలో ఏనాడూ చిన్న అనారోగ్యం కూడా ఎరగని మనిషి.. ఒక్కసారే గాయాలతో మంచంపై స్పృహ కోల్పోయిన స్థితిలో చూడడంతో తట్టుకోలేక భోరుమని ఏడ్చేసిందామె. సౌమ్య పరిస్థితి కూడా దాదాపుగా అలాగే వున్నా దుఃఖాన్ని బలవంతంగా కంట్రోల్ చేసుకుని తల్లిని ఓదారుస్తూ ఉండిపోయిందామె.

అంతలో ఆ గదిలోకి డాక్టరు, నర్స్ రావడంతో కళ్లు తుడుచుకుంటూ లేచి నిలబడిందామె.

''మీరు...'' ప్రశ్నార్థకంగా చూస్తున్న డాక్టర్‌తో పేషెంట్‌తో తమకున్న రిలేషన్ చెప్పిందామె.

''కంగారు పడనవసరం లేదమ్మా. యాక్సిడెంట్ జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా హాస్పిటల్‌కు తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. బ్లడ్ కూడా ఎక్కించాం. ఇట్స్ ఎ రేర్ బ్లడ్ గ్రూప్. సమయానికి మా దగ్గర ఆ గ్రూప్ రక్తం లేకపోవడంతో... అతను... ఎవరతను? మీ అబ్బాయా?'' పేషెంట్‌కు ఇంజక్షన్ చేయడం ముగించి సిరంజిని సిస్టర్‌కి అందిస్తూ అడిగాడాయన.

అతనెవరో అర్థంకాని ఆ తల్లీకూతుళ్లు ఒకరి ముఖాలొకరు చూసుకుంటుండగా ఆ గదిలోకి అడుగుపెట్టాడతను.

అతను... అతనే!

★★★

''నీ మేలు ఈ జన్మలో మరువలేం బాబూ. సమయానికి నువ్వక్కడ వుండబట్టి సరిపోయిందిగానీ లేకపోతే ఎంత ఘోరం జరిగి ఉండేది?'' కప్పులో కాఫీ పోసి అతనికందిస్తూ చెప్పింది సుగుణ.

''అయ్యో అంత మాటెందుకండీ? అంకుల్‌కి ప్రమాదం తప్పింది. అంతేచాలు'' కాఫీ తాగుతూ చెప్పాడతను.

అప్పటికి ఆ హాస్పిటల్‌లో రెండురోజులు గడిచిపోయాయి. రామకృష్ణ కూడా త్వరగానే కోలుకున్నాడు. మరో రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని డాక్టర్ చెప్పడంతో సుగుణ మనసు కొంచెం కుదుటపడింది. హాస్పిటల్‌లోకి వచ్చినప్పటి నుండీ తమ అవసరాలను గమనిస్తూ వేళకు ఇంటి నుండి భోజనం కూడా తెచ్చిపెడుతూ సొంత కొడుకులా సహాయపడుతున్న అతనంటే సుగుణకు ప్రత్యేకమైన అభిమానం ఏర్పడిపోయింది.

''అమ్మ మిమ్మల్ని చూడాలంటోంది ఆంటీ. సాయంత్రం అమ్మని తీసుకొస్తాను'' ఆమె ఆలోచనలను భంగం కలిగిస్తూ చెప్పి వెళ్లిపోయాడతను.


అతనెళ్లిపోయాక ఆ ముగ్గురి మధ్య నిశ్శబ్దం చోటు చేసుకుంది. కొద్ది క్షణాల తరువాత భార్య అందించిన జ్యూస్ తాగుతూ రామకృష్ణ చెప్పాడు.

''చాలా మంచి కుర్రాడు. అసలు అతనికీ మనకీ ఏం బంధుత్వం ఉందనీ?''

''అవునండీ. అసలు మీకు రక్తం ఇచ్చిన విషయం కూడా నా దగ్గర ఇంతవరకూ ప్రస్తావించలేదు తెలుసా? ఈ రోజుల్లో కూడా ఇంత నిస్వార్థంగా సహాయం చేసే వాళ్లుంటారా అన్పిస్తోంది అతన్ని చూస్తుంటే.''

మౌనంగా తల్లిదండ్రుల సంభాషణంతా వింటున్న సౌమ్య మొదటిసారిగా అతని గురించి ఆలోచించడం మొదలెట్టింది.

ఆ తరువాత రెండురోజుల్లో అతని తల్లిదండ్రులు హాస్పిటల్‌కి వచ్చిపోతుండడంతో వాళ్లతో సౌమ్య తల్లిదండ్రులకు బలమైన అనుబంధం ఏర్పడిపోయింది. చూస్తుండగానే హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయ్యే సమయం దగ్గరకొచ్చేసింది.



★★★

ఫార్మాలిటీస్ పూర్తి చేయడానికి అందరూ వెళ్లిపోవడంతో ఆ గదిలో ఒక్కతే మిగిలిపోయింది సౌమ్య.

బెడ్‌షీట్స్ మతడలు పెట్టి బ్యాగ్‌లో సర్దుతున్న సౌమ్య ఏదో అలికిడికి వెనక్కి తిరిగి అతన్ని చూసింది.

ఆ గదిలో ఏకాంతంలో అతనెదురు పడడంతో ఏం మాట్లాడాలో మొదట అర్థం కాలేదామెకు. అసలేమీ మాట్లాడకపోతే బాగుండదని ఎలాగో నోరు పెగిల్చిందామె.

''ఈ నాలుగురోజులూ మాకెంతో హెల్ప్ చేశారు. చాలా థాంక్సండీ.''

''ఓ కమాన్. ఇట్ ఈజ్ నథింగ్ ఫర్ మి.''

బట్టలు సర్దడం కూడా పూర్తయింది. బయట తన కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తుంటారని తెలుసు. అయినా ఆమెకెందుకో అక్కడినుండి కదలాలని లేదు. అతనితో ఇంకా మాట్లాడాలని ఉన్నా మనసులో ఏదో అడ్డుకుంటోంది. ఇంకా చిత్రంగా ఇంతకుముందు బట్టతల కారణంగా ఆకర్షణ కోల్పోయిన అతనిలో కొత్త అందం కనిపిస్తోందామెకు.

''మిమ్మల్నో విషయం అడగాలనుకుంటున్నాను'' ఇద్దరి మధ్య నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడతను.

''అడగండి.''

''ఈ పెళ్లి మీకిష్టం లేదని తెలిసింది. మే ఐ నో ద రీజన్?''

అంత సూటిగా అతనలా అడుగుతాడని ఊహించని సౌమ్య కొద్దిగా తడబడింది. అయినా అసలిలాంటి సందర్భం కోసమే ఎదురుచూస్తున్నట్లు త్వరగా మాట్లాడేయమని మనసు తొందర చేయడంతో కంగారును పక్కకునెట్టి కొంటెతనాన్ని అరువు తెచ్చుకుని వాతావరణాన్ని తేలికపరుస్తూ చెప్పిందామె.

''అప్పుడు ఇష్టం లేని మాట నిజమే!''

''మరి ఇప్పుడు?'' ఆమె కళ్లల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు.

బ్యాగ్ భుజానికి తగిలించుకుని తలుపు వద్దకి మౌనంగా నడిచివెళ్లి వెనక్కి తిరిగి చెప్పిందామె.

''చాలా చాలా ఇష్టం.''

ఆ సమాధానంతో కలుసుకున్న వాళ్లిద్దరి కళ్లతోపాటు పెదవులు నవ్వుకున్నాయి.

అప్పుడే కూతురికోసం అటుగా వచ్చి వాళ్ల సంభాషణంతా విన్న సుగుణ కళ్లు సంతోషంతో చెమర్చాయి.

★